క్లుప్తంగా

అంగన్‌వాడీలకు శిక్షణ

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషన్‌బీ. పడాయిబీ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భీమదేవరపల్లి మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు సీడీపీఓ స్వరూప తెలిపారు. సూపర్‌వైజర్లు అనిత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



శాయంపేట : మండల కేంద్రంలోని మైలారం రోడ్డులో ఎత్తు తక్కువగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి ఎక్కువ ఎత్తువున్న స్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఈ చందూలాల్ గురువారం తెలిపారు. భారీ వాహనాలకు విద్యుత్ తీగలు తగులుతుండగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జేఎల్ఎం విష్ణు, సిబ్బంది ఉన్నారు.

21న మండలానికి చేరనున్న బస్సు యాత్ర

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఈనెల 21వ తేదీన శాయంపేట మండలానికి చేరుకోనున్నట్లు ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారులు పార్టీలకతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి

ఎల్కతుర్తి : ఈనెల 21వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ పిలుపునిచ్చారు. గురువారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో పేకాడుతున్న ఏడుగురిని గురువారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ గ్రామ పరిధిలో కొందరు రహస్యంగా పేకాడుతున్నారనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.4 వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని 4 బైక్‌లు సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో పేకాడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సంతోశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుడెప్పాడ్‌లో ఎండీ.జానీపాషా ఇంటి దాబాపైన పేకాడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించగా ఎండీ. జానీపాషా, గొట్టిముక్కుల రవి, వెంపటి శ్రీకాంత్, కందికట్ల అశోక్, దూలం రవీందర్, అక్తర్‌పాషను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయగా మరో వ్యక్తి గొట్టిముక్కల సందీప్ పరారైనట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.4,500నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ముక్కలు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సైలు తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆత్మకూరు : పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని లింగమడుగుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగమడుగుపల్లికి చెందిన వజ్రశ్యామ్‌రావు(55) భార్య రమ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి శ్యామ్‌రావు ఒంటరితనంతో బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

సంగెం : ఈనెల 21న హనుమకొండలో నిర్వహించనున్న తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను మండల కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మంకాల యాదగిరి గురువారం ఆవిష్కరించారు.

చిన్న మత్తడికి మరమ్మతులేవి..?

- రెండేళ్లు దాటినా అదే పరిస్థితి
- ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకొన్న అధికారులు
- ఈసారి మత్తడి దుంకితే పెద్ద మత్తడికి పొంచిఉన్న ప్రమాదం



గండి పడి కొట్టుకుపోయిన కమలాపూర్ పెద్ద చెరువు చిన్న మత్తడి

కమలాపూర్ : కాకతీయుల కాలంలో సుమారు 445 ఎకరాల విస్తీర్ణంలో కమలాపూర్ పెద్దచెరువు నిర్మాణం చేపట్టారు. ఆ చెరువు కింద అధికారికంగా 1,272 ఎకరాల్లో, అనధికారికంగా సుమారు 2 వేలకు పైగా ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. మండలానికి సాగు, తాగు నీరుకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ చెరువు వందలాది మత్స్య కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. అయినప్పటికీ ఈ చెరువును పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

రెండేళ్లుగా మరమ్మతులు లేవు..

చెరువు కింద తమ పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయనే నెపంతో గతంలో కొందరు రైతులు కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి రాళ్లను ఒకటి, రెండు వరసలు తొలగించారు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గిపోయింది. దీనికి తోడు 2023 జూలై 26న రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దుంకింది. నీటి ఉధృతికి తట్టుకోలేక చెరువు చిన్న మత్తడి దెబ్బతిని గండి పడగా రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు మత్తడికి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. గతేడాది వర్షాకాలంలో గండి పడ్డ చిన్న మత్తడి వద్ద తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆ మరునాడే భారీ వర్షం కురిసి ఆ ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయని రైతులు వాపోతున్నారు. ఒకప్పుడు చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దుంకితే మూడు ఫసళ్లు పండటంతో పాటు మరో పంటకు సంబంధించి నారుమడులకు నీళ్లు సరిపడేవని, ప్రస్తుతం రెండు ఫసళ్లకే సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన తూములు..

కమలాపూర్ పెద్ద చెరువు రెండు తూములు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. పెద్ద తూము షట్టర్లు సరిగా పని చేయకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. పెద్ద తూము వద్ద బుంగలు పడి నీరంతా లీకవుతోందని, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో దొంగచాటుగా తూముల షట్టర్లు ఎత్తి నీటిని వృథాగా వదిలేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న తూము షట్టర్ రాడ్ విరిగిపోయినా సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



2023లో కురిసిన అతి భారీ వర్షాలకు పెద్ద చెరువు చిన్న మత్తడి గండి పడి కొట్టుకుపోయింది. రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. చెరువు మత్తడి దెబ్బతిని గండి పడిన కారణంగా చెరువులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా స్పందించలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి భారీగా వరద చేరుతోంది. వరద ఉధృతి పెరిగితే చిన్న పెద్ద మత్తడికి కూడా ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– అశోక్, చెరువు నీటి సంఘం మాజీ చైర్మన్

పాలిటెక్నిక్ హాస్టల్ బియ్యం పక్కదారి



పరకాల : పోలీసులకు పట్టుబడిన బియ్యం ట్రాలీ

- పట్టుకున్న పోలీస్‌లు

పరకాల : పట్టణంలోని పాలిటెక్నిక్ హాస్టల్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పాలిటెక్నిక్ హాస్టల్ నుంచి అక్రమంగా సన్నబియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఓ సామిల్ డిపో వద్ద పట్టుకున్నట్లు తెలిసింది. బీసీ హాస్టల్ వార్డెన్ రవి బీసీ హాస్టల్‌తో పాటు పాలిటెక్నిక్ హాస్టల్‌కు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఆయనే ఈ బియ్యాన్ని విక్రయించేందుకు బయటకు తరలిస్తుండగా పోలీసులు ట్రాలీతో పాటు అందులో ఉన్న సన్నబియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కమలాపూర్‌లో నిల్వ చేసిన బియ్యం..



కమలాపూర్ : పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 9.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లిలో తుమ్మల రమేశ్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని ఇతర గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు తన ఇంట్లో నిల్వ చేశాడనే సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో అతని ఇంటిపై దాడులు చేసి ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 9.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం కమలాపూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

పీఏసీఎస్ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

కమలాపూర్ : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన యూరియా అక్రమాలపై పీఏసీఎస్ కార్యదర్శి ఎండీ.చోటేమియాపై హనుమకొండ జిల్లా సహకార అధికారి విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు మండలానికి చెందిన హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్ గురువారం తెలిపారు. పీఏసీఎస్ కార్యదర్శి చోటేమియా వరుసలో వేచి ఉన్నవారికి బదులుగా తనకు అనుకూలమైన వ్యక్తులు కొందరికి పది యూరియా బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నాడని,అది కూడా అక్కడ భద్రతా విధులు నిర్వహిస్తున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ సమక్షంలోనే జరిగిందని ఆరోపించారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఎవరికైనా ఇస్తానని కార్యదర్శి బదులిచ్చాడని ఆరోపిస్తూ రమేశ్ గౌడ్ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని జిల్లా సహకార కార్యాలయ జూనియర్ ఇన్‌స్పెక్టర్ భద్రుద్దీన్‌ను ఆదేశిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు రమేశ్‌గౌడ్ తెలిపారు.

నవనాగ ఆలయంలో ఆశ్లేష బలిపూజ



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో గల నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆశ్లేష బలిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్ప దోషం, నాగ దోషం, కుజ దోషం, మాంగళ్య దోషం, కాల సర్ప దోషాల నుంచి ఉపశమనం కలిగి రక్షణ పొందేందుకు ఈ పూజ దోహదపడుతుందని సుబ్రహ్మణ్య ఉపాసకుడు గంట పవన్‌శర్మ తెలిపారు. ఆశ్లేష బలిపూజ చేయడం ద్వారా రాహు, కేతువుల దుష్ప్రభావాలు తొలగిపోతాయని అన్నారు. పూజలో పాల్గొనేవారు 9908998839 నంబర్‌ను సంప్రదించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఎన్ఎఫ్‌బీఎస్‌పై అవగాహన కల్పించాలి

శాయంపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా అందజేస్తున్న నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీఓ రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ స్కీం ద్వారా నిరుపేద వితంతువులకు రూ. 20,000 సాయం అందిస్తున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరం నుంచి 2025 వరకు జరిగిన మరణాలను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులు ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నారో లేదో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చెప్పాలన్నారు. గ్రామ సభలు, చాటింపు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సంక్షిప్తంగా

రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం మానుకోవాలి

ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఆత్మకూరు సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. పది సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేశారని, వారిని ప్రజలు తరిమికొట్టినా బుద్ధి రాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం, విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా కొరతను సృష్టించింది కేంద్ర ప్రభుత్వమైతే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ప్రతిపక్ష నాయకుల కళ్లు మండుతున్నాయని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు.

రేపు లీగల్ సర్వీస్ క్లినిక్ ప్రారంభం

శాయంపేట : మండలంలోని తహరాపూర్, కొప్పుల గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 20వ తేదీన హనుమకొండ జిల్లా లీగల్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామ లీగల్ సర్వీస్ క్లినిక్‌లు ప్రారంభించనున్నట్లు జిల్లా జడ్జి, హనుమకొండ జిల్లా లీగల్ సర్వీస్ చైర్మన్ డాక్టర్ పట్టాభి రామరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న తహరాపూర్‌లో ఉదయం 10 గంటలకు, కొప్పులలో 11 గంటలకు లీగల్ సర్వీస్ క్లినిక్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అగ్రికల్చర్ విద్యార్థుల సందర్శన

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో గురువారం ఎస్సార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు సందర్శించారు. గ్రామీణ అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పరిస్థితులను సమగ్రంగా అధ్యాయనం చేసి, వనరులు, భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయం, సామాజిక అంశాలు, పశు సంవర్ధక రంగం తదితర అంశాలను చిత్రపటాల రూపంలో ప్రదర్శించారు. డాక్టర్ భూపాల్‌రాజ్, కోఆర్డినేటర్ శ్రీకర్ రెడ్డి, ప్రొఫెసర్ స్రావ్య, కార్తీక్, విద్యార్థులు శివాణి, నవచైతన్య, నందిని సౌజన్య పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట గ్రామంలో చాటుగా విక్రయిస్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేట గ్రామానికి చెందిన సామల అశోక్ ఇంట్లో గుడుంబా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో నాలుగు లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఇటీవల సముద్రాల సుగుణ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రేవూరి జలంధర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మృతురాలి కుమారుడు జర్నలిస్టు సురేష్‌ను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. జర్నలిస్టులు సముద్రాల విజేందర్, కందకట్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కండువా కప్పుతున్న చల్లా ధర్మారెడ్డి

పరకాల : రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభావం తప్పదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని మల్లక్‌పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేయగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. యూరియా లేక రైతులు, తులం బంగారం పేరిటా ఆడబిడ్డలను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచినా ప్రభుత్వానికి చలనం లేదని మండిపడ్డారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, రాజేందర్, యూత్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు / దామెర : కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కటాక్షపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నరసింహరాములు కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే దామెర మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన కీసరి సమ్మయ్య, ఊరుగొండకు చెందిన అక్కెళ్ల సౌందర్య, మన్న ఉప్పలయ్య, పసరగొండకు చెందిన మామిడి సాంబక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ వాసంతి

ఎల్కతుర్తి: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ క్రీడా సెలక్షన్స్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకుని మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఎంఈఓ చదువుల సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎల్.మనోహర్ నాయక్, సిస్టర్ సీసీ థెరిస్సా, రాజేశ్వరయ్యాచారి, రాముడు, ధనలక్ష్మి, ప్రభావతి, ప్రేమ్‌సాగర్, స్వరూప, శ్రీకాంత్, కిరణ్‌రావు, పూర్ణిమ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని విమర్శిస్తే సహించం

- కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కడియం శ్రీహరి గెలుపు కోసం పనిచేయలేదని, బీఆర్ఎస్ నాయకులంతా జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోసం పనిచేశారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొనుగోలు చేసినట్లు కేసీఆర్ వ్యవహరించారని, అప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. దమ్ముంటే గతంలో రాజయ్యకు డిప్యూటీ సీఎం పదవి నుంచి ఎందుకు తీసేసారని, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఎందుకు ఇవ్వలేదని కేసీఆర్‌కు ఉత్తరాలు రాయాలని హితవుపలికారు. మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. గురువారం ఉదయం అంబాల శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి నుంచి హనుమకొండకు ఇసుక తరలిస్తూ నాలుగు ట్రాక్టర్లు తారస పడినట్లు చెప్పారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక అక్రమ తరలింపునకు పాల్పడిన పోతిరెడ్డిపల్లికి చెందిన ఎండీ.యాకూబ్‌పాషా, దూలం వేణు, జిల ఐలుకొమురు, నల్లవెల్లి శ్రీకాంత్ అనే ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేనేత కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం



చేనేత సంఘం ఎదుట నిరసన తెలుపుతన్న కార్మికులు

శాయంపేట : చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని కార్మిక సంఘం నాయకులు పూల అయిలుమల్లు, బూర లక్ష్మీ నారాయణ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఎదుట చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదని అన్నారు. చేనేత కార్మికులకు చేనేత భరోసా ద్వారా సంవత్సరానికి రూ.18వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా రూ.9వేల కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు అనేక హామీలు ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణలో మురుగునీరు



పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగునీరు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదతో పాటు చెతాచెదారం చేరడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని అంటున్నారు. క్రీడలు ఆడుకునే ఆవరణలో మురుగునీరు నిల్వడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయని తెలిపారు. దీంతో డెంగీ, మలేరియా, విషజ్వరాలు వచ్చే ప్రమాదరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలంటున్నారు.


'వికసిత్ భారత్' సాధించడమే బీజేపీ లక్ష్యం



శ్రమదానం చేస్తున్న నాయకులు

దామెర : స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని సాధిస్తేనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. సేవా పక్షం–2025 కార్యక్రమంలో భాగంగా ల్యాదెళ్ల వేంకటేశ్వరస్వామి ఆయల ప్రాంగణంలో గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సంద్బంగా అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యువతలో సేవా భావం పెంపొందాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



పర్వతగిరి : కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అత్తి కుమారస్వామి తెలిపారు. మండలంలోని వడ్లకొండలో అలుగునూరి భాగమ్మ చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని గురువారం కుమారస్వామి ప్రారంభించి మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. దశలవారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాల్లె రాజు, నాయకులు రమేశ్, పంతంగి వెంకన్న, కోదాటి గోపాలరావు, అలుగునూరి ఎల్లయ్య, చింతకాయల రమేశ్, వడ్డే కుమారస్వామి, అలుగునూరి రాజు, రాంబాబు, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ వల్లందాస్ చిన్ని రంగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.